ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కరీంనగర్

జిల్లా వార్తలు

5

గురువారం 19 డిసెంబరు 2024

బల్దియాకు 48 మంది ఉద్యోగులు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-4లో ఎంపికైన 48 మంది ఉద్యోగులను నగరపాలక సంస్థకు కేటాయించారు. బుధవారం 42 మంది వార్డు అధికారులు, ఒక జూనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు జూనియర్ అకౌంటెంట్లు కమిషనర్ చాహత్ బాజ్‌పాయిని కలిసి విధుల్లో చేరారు. నగరపాలక సంస్థలో అనేక పోస్టులు చాలా రోజులుగా ఖాళీగా ఉన్నాయి. దీనితో దశలవారీగా ప్రభుత్వం ఇక్కడికి ఉద్యోగులను కేటాయిస్తుండడంతో ఇప్పుడిప్పుడే పోస్టులు భర్తీ అవుతున్నాయి.



అసెంబ్లీలో మాటల యుద్ధం

● పొన్నం X గంగుల

కరీంనగర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ల మధ్య బుధవారం మాటల యుద్ధం నడిచింది. కరీంనగర్ శాసన సభ్యుడు గంగుల కమలాకర్ చేసిన వాఖ్యలకు అసెంబ్లీలో దుమారం చెలరేగడం, వ్యక్తిగత విమర్శలు సరైనవి కావంటూ అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గంగుల కమలాకర్‌కు సూచిస్తూ ముగింపు పలికే ప్రయత్నం చేశారు. చర్చలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ మూసీ రివర్‌ఫ్రంట్, మానేరు రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించారని గుర్తు చేశారు. దీనితో పాటు కేబుల్ బ్రిడ్జినిర్మాణం చేపట్టామన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ నిర్మాణంకోసం 450 కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. వ్యవసాయ, రోడ్లు భవనాలు, పర్యాటక శాఖల ఆమోదం కూడా లభించిందన్నారు. ఇప్పటికే డెబ్బై శాతం పనులు పూర్తి కాగా మిగతా పనులు ప్రభుత్వం పూర్తి చేస్తే ఒక అసెట్ మిగిలుతుం దన్నారు. ఆదాయం కూడా సమకూరే అవకాశం ఉండగా పెండింగ్ ఉంచకుండా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు.

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ 2004 నుంచి 2014 వరకు తామే అధికారంలో ఉన్నామని గ్రీన్ ఛానల్ ద్వారా మెస్‌చార్జీలు అందించామని, ఇప్పుడు గురుకులాలకు తాళం వేస్తే బతిమిలాడి నడిపిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ గురుకుల పాఠశాలలకు అద్దె చెల్లించి నడిపించారే తప్ప సొంత భవనాలు నిర్మించలేదన్నారు. తాము అధికారంలో ఉన్న నాడు విద్యారంగంపై దృష్టి సారించడం వల్లే గ్రామాల నుంచి తామందరం కరీంనగర్‌లో ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యాభ్యాసం చేశామన్నారు.

పార్లమెంట్‌లో జరిగిన పెప్పర్ స్ప్రే ఘటన డూప్లికేటా కాదా అని తాను అనలేదని, దొంగ ఏడుపులు అని తాను అనలేదని, కరీంనగర్ తెలంగాణచౌక్‌లో కొట్లాట గురించి అసెంబ్లీలో ఎందుకు అని గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ నుంచి ఎందుకు పారిపోయావని తాను అనలేదని, తాను సంక్షేమం గురించి ప్రశ్నిస్తే సంబంధిత శాఖ మంత్రి జవాబివ్వడానికి బదులు మొదటిసారి అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యేతో చెప్పిస్తే ఎలా అంటూ గంగుల కమలాకర్ పేర్కొన్నారు.

దీనిపై మంత్రి పొన్న స్పందిస్తూ తనను మొదటిసారి ఎమ్మెల్యే అంటూ చేసిన వాఖ్యలపై మండిపడ్డారు. తాను ఎంపీగా ఉన్నానని, తెలంగాణ కోసం పార్లమెంట్‌లో కొట్లాడానని, కావాలంటే రికార్డులు పరిశీలించకోవాలన్నారు. తెలంగాణ కోసం స్పీకర్ కాళ్లు కూడా మొక్కానన్నారు. రాజకీయాల్లో వేరే నియోజకవర్గాల నుంచి పోటిచేయడం సర్వసాధారణమని, పీవీ నర్సింహారావు మంథని నుంచి పోటీచేయలేదా అని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు ఇతర నియోజకవర్గాల్లో పోటీ చేయడం పారిపోవడం అవుతుందా అని అన్నారు. వారి నాయకులను అనలేక తనను ఉద్దేశించి అంటున్నారని గంగుల వాఖ్యలను తిప్పికొట్టారు. షేర్ పటాకా అని తాను అనలేదని, వాళ్లపార్టీ నేత ఒక ఎమ్మెల్యేపై స్వయంగా చేసిన వాఖ్యలే తప్ప తాను అనడంలేదన్నారు. మొదటి సారి అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యేలను ఉద్దేశించి గంగుల చేసిన వాఖ్యలను పరిశీలించి రికార్డుల నుంచి తొలగించాలని పొన్నం కోరారు. ఓడినా గెలిచినా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని పదవుల కోసం పార్టీలు మారలేదని పొన్నం స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా పోతే చాలా ఉన్నాయని, ఉత్సవాల పేరుమీద ఏం మాట్లాడారో కూడా చెబుతానని హెచ్చరించారు. గంగుల కమలాకర్ లాగా తన వద్ద డబ్బు సంచులు లేవని, ప్రజల అండదండలతో రాజకీయాల్లో ఉన్నానని పొన్నం వివరించారు.

కాంగ్రెస్‌లో అసమ్మతి రాగం

- డీసీసీ కార్యాలయంలోనే నియోజకవర్గ ఇన్‌చార్జి సమావేశం
- ఇంచార్జి మంత్రిపై ధ్వజం
- నిధుల మంజూరు, ఇతర పనులపై ఆరోపణలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

అధికార కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి రాజుకుంటోంది. జిల్లా రాజకీయాలకు ఆయువు పట్టు కరీంనగర్ నియోజకవర్గంలోనే పార్టీని పట్టించుకునేవారే లేరని, నియోజకవర్గ ఇన్‌చార్జికి తెలియకుండా, కార్యకర్తల అభిప్రాయాలను పట్టించుకోకుండా నిధులు కేటాయించడంలో, ఇతర కార్యక్రమాలు చేపట్టడంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని అసమ్మతి గళాలు వినిపిస్తున్నాయి. సాక్షాత్తూ ఈ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ డీసీసీ కార్యాలయంలోనే నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి తన అసంతృప్తి వెళ్లగక్కడం పార్టీలో కలకలం సృష్టిస్తున్నది. ఇంతకాలం మంత్రి పొన్నం ప్రభాకర్ వెన్నంటి ఉంటూ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్న పురుమల్ల శ్రీనివాస్ పేరు చెప్పకుండానే పలు ఆరోపణలు చేస్తూ సమావేశంలో మాట్లాడడంతో అసమ్మతి ఇక రోడ్డున పడే సమయం వచ్చిందనే మాటలు వినవస్తున్నాయి.



కరీంనగర్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, పాల్గొన్న నాయకులు

గత అసెంబ్లీ ఎన్నికల్లో పురుమల్ల శ్రీనివాస్ కరీంనగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి పరాజయం పాలయ్యారు. ఆ సమయంలో పురుమల్ల శ్రీనివాస్ ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీస్సులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుని అండదండలతో అభ్యర్థిత్వాన్ని సాధించుకున్నారని ప్రచారం జరిగింది. ప్రస్తుత సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు కూడా ఆనాడు టికెట్ ఆశించగా నరేందర్‌రెడ్డికి ప్రస్తుత మంత్రి శ్రీధర్‌బాబు అండగా నిలిచారు. అయితే అధిష్టానం మాత్రం పురుమల్లకే అవకాశం కల్పించింది. ఆ ఎన్నికల్లో పురుమల్ల ఓడిపో వడంతో నియోజకవర్గ ఇంచార్జిగా కొనసాగుతున్నారు. ఏడాదికాలంగా ఆయన మంత్రి పొన్నం వెంట తిరుగుతూ కార్యక్రమాలు చేపడుతూ వచ్చి ఏ రోజు కూడా ఏ విషయంలోనూ అసంతృప్తి వ్యక్తం చేయకుండా వచ్చారు. అయితే ఆయన బుధవారం డీసీసీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి తన అసంతృప్తిని వెళ్లడించడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నది.

ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యవహరిస్తుండగా ఈ పరిధిలోనే మంత్రులుగా పొన్నం ప్రభాకర్, డి శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. శ్రీధర్‌బాబు ఈ నియోజకవర్గ కేంద్రానికి వచ్చి ఎలాంటి

మిగతా 8వ పేజీలో...

● కార్యకర్తలకు న్యాయం చేయాలి

పురుమల్ల శ్రీనివాస్ సమావేశంలో తాను కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి అయినప్పటికీ తనకు తెలియకుండానే నియోజకవర్గంలో నిధుల కేటాయిస్తూ తనను అవమానపరుస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇంచార్జిగా ఉన్న తనను సంప్రదించకుండానే 3 కోట్ల 9 లక్షల రూపాయలు నియోజకవర్గ అభివృద్ధి నిధులలో 2 కోట్ల 70 లక్షలు నగరశివారులోని వీవీఆర్ గార్డెన్ ఎదురుగా సీసీ రోడ్‌కు పెట్టారని, అవే నిధులలో స్థానిక కార్యకర్తల సూచన మేరకు ఆయా ప్రాంతాల్లో 10 లక్షల రూపాయల చొప్పున పనులను కేటాయిస్తే పార్టీని అంటిపెట్టుకుని కష్టపడిన వారికి న్యాయం చేసినట్లు ఉండేదని ఆయన వాపోయారు. ఉజ్వలపార్క్ నిర్వహణ టెండర్‌ను, రూరల్ మండలంలోని ఒక ఇసుక క్వారీతోపాటు మానకొండూర్‌లో మరో ఇసుక క్వారీని పెద్ద నాయకుడు తన బంధువులకే ఇప్పించుకున్నారని పురుమల్ల సమావేశంలో ఆరోపించడం కలకలం సృష్టించింది. పార్టీకి, నాయకులకు కార్యకర్తలే బలమని, అటువంటి కార్యకర్తలను నాయకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ప్రస్తుతం ఇంచార్జిగా ఉన్నప్పటికీ కరీంనగర్‌కు వచ్చే మంత్రుల పర్యటనల వివరాలు, కార్యక్రమాలు, నిధుల కేటాయింపు, వివిధ పదవుల నియామకాల కనీస సమాచారాన్ని కూడా ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నియోజకవర్గంలో తాను కార్యకర్తలకు ఏ సమాధానం చెప్పుకోలేని స్థితిలో ఉన్నానని అన్నారు. కరీంనగర్ మార్కెట్ కమిటీ, సుడా డైరెక్టర్ పదవులు, గ్రంథాలయ డైరెక్టర్ పదవులను భర్తీ చేయడం లేదని, అలాగే జిల్లాలోని ఆలయాలకు కమిటీలను ఏడాదైనా ఏర్పాటు చేయటంలేదని, ఈ నియామకాలు జరిగితే కనీసం 50, 60 మంది కార్యకర్తలకు అవకాశం లభించేదని అన్నారు. ఈ సమావేశం ఏర్పాటు చేసినందుకు తనపై ఏ అస్త్రాలు ప్రయోగించినా పర్వాలేదని, తాను గెలిచి వస్తానని అన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్, పడిశెట్టి భూమయ్య, మహ్మద్ ఆరిఫ్, నాయకులు ఎండీ తాజ్, మోహనాచారి, దన్నా సింగ్, మనిగంటి అనిల్ తదితర వందమంది నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంతో నియోజకవర్గ అసమ్మతి రాజకీయాలు తెరపైకి వస్తున్నాయి.

పోషకాహార లోపంలేని జిల్లాగా మార్చాలి

● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌ను పోషకాహార లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోషణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ అన్నిశాఖల సమన్వ యంతో పనిచేస్తూ పోషణలోపం లేని జిల్లాగా మార్చాలని ఆదేశించారు. జిల్లాలో తీవ్ర లోపపోషణతో ఉన్న పిల్లలను గుర్తించి, వారిని వైద్యశాఖ సహకారంతో ఎన్ఆర్‌సికి పంపించాలన్నారు. ఎన్ఆర్‌సిలో ప్రత్యేక ఆహారం, చికిత్స ద్వారా పిల్లలు పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడి కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాల ద్వారా పోషణ ప్రాముఖ్యతను గురించి వివరించాన్నారు. మునగ, కరివేప, నిమ్మవంటివి ఆహారంలో భాగంగా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైని కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి సబితా, వైద్య అధికారి వెంకటరమణ, డీఈవో జనార్దన్‌రావు, డీపీవో రవీందర్, సీడీపీవోలు, పోషణ అభియాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పక్కనే అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

ఉత్సాహంగా జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు

● మూడవరోజు 800 మంది క్రీడాకారుల హాజరు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి చీఫ్ మినిస్టర్స్ కప్-2024 క్రీడా పోటీలు జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం జరిగిన వివిధ పోటీలను రాష్ట్ర ఒలంపిక్ సంఘ సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, జిల్లా యువజన క్రీడా శాఖాధికారి వి శ్రీనివాస్ గౌడ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ క్రీడాకా రులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం కప్ పోటీలు దోహదపడతాయన్నారు. సాఫ్ట్‌బాల్ పోటీలకు వివిధ మండలాల నుంచి 8 పురుషుల జట్లు, 6 మహిళల జట్లు హాజరై ప్రతిభ చాటాయి. అలాగే నెట్‌బాల్ పోటీలకు జిల్లాలోని 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. స్టేడియంలోనే నిర్వహించిన బాస్కెట్‌బాల్ పోటీల్లో 55 మంది బాలబాలికలు పాల్గొన్నారు. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన కరాటే, సెపక్ తక్రా పోటీలను విశేష స్పందన లభించింది. జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించగా విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. అలాగే ఫండస్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ఉషు పోటీలను నిర్వహించారు.



బాస్కెట్‌బాల్ ఆడుతున్న బాలికలు

హాకీ @ హుజూరాబాద్

- క్రీడతో 60 ఏళ్ల అనుబంధం
- ప్రతిభ చాటుతున్న క్రీడాకారులు
- శిక్షణతో మరింత మంది ముందుకు

-హుజూరాబాద్, ఆంధ్రజ్యోతి

7

సీఆర్ఐఎఫ్ నిధుల కోసం వినతి

- కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

- కరీంనగర్, ఆంధ్రజ్యోతి

7

21న బల్దియా సర్వసభ్య సమావేశం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పాలక వర్గ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 21న నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వచ్చే నెలతో పాలకవర్గ పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో దాదాపు 20 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ఆమోదం తీసుకోవడంతో పాటు నగరపాలక సంస్థకు ఆదాయ వనరులను సమకూర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా ప్రారంభోత్సవానికి నోచుకోని మున్సిపల్ వాణిజ్య సముదాయాల కేటాయింపు, పద్మనగర్‌లో నిర్మాణ పనులు తుదిదశకు చేరిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో దుకాణాల కేటాయింపు, వ్యాపారుల నుంచి తీసుకోవలసిన రుసుము, మల్టీపర్పస్ పార్కు ప్రారంభోత్సవం, పెండింగ్ పనులకు సంబంధించిన అంశాలతో కూడిన ఎజెండాను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. మరో ఒకటి, రెండు సమావేశాలు మాత్రమే జరిగే అవకాశాలుండడంతో కార్పొరేటర్లు వారివారి డివిజన్ సమస్యలపై ఈ సమావేశంలో ప్రస్తావించి, వాటికి నిధులను కోరే అవకాశముంది.

విలీనం వద్దు

6 గతంలో కార్పొరేషన్‌లో విలీనం అయిన గ్రామాల్లో పన్నుల భారం తప్ప ఆశించిన అభివృద్ధి లేదని ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. మరిన్ని గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయనున్నట్లు చర్చ జరుగుతుండటంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. ఇప్పటికే ఐదేళ్ల క్రితం విలీనం చేసిన గ్రామాల్లో అభివృద్ధి ఆశించిన మేరకు జరుగలేదు. కనీస సదుపాయాలు కూడా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మళ్లీ విలీనం ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కరీంనగర్ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ కరీంనగర్‌గా మార్చే దిశలో భాగంగా నగరపాలక సంస్థలో సమీపంలోని ఐదు గ్రామాలు, ఒక మున్సిపాలిటీని విలీనం చేయాలంటూ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వాన్నికోరుతూ చేసిన ప్రతిపాదనతో గ్రామాల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. 2023 జనవరి 31తో గ్రామపంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యుల పదవీ కాలం ముగియడంతో ఫిబ్రవరి 1 నుంచి నేటి వరకు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపాదన మేరకు ప్రభుత్వం ఐదు గ్రామాలను విలీనం చేస్తుందో లేక ఎన్నికలు నిర్వహిస్తుందో తెలియక ప్రజల్లో సందిగ్ధం నెలకొంది. తాజాగా నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు కూడా ఇప్పటికే విలీన ప్రతిపాదనను విరమించుకొని వాటిని అవసరమైతే మున్సిపాలిటీలుగా చేయాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ పంపించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ విలీన ప్రతిపాదనపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకునే అవకాశముందంటూ చర్చ జరుగుతోంది.

● ప్రజలపై పన్నుల భారం

విలీన డివిజన్లలో అభివృద్ధి గత గ్రామపంచాయతీ కంటే ఎక్కువగా ఏమీ జరుగలేదని, పన్నులభారం పెరిగిందని ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ ఉంటే బాగుండేదని వాపోతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపాదించిన ఐదు గ్రామాలు, ఒక మున్సిపాలిటీని కార్పొరేషన్‌లో విలీనం చేస్తే నగర విస్తీర్ణం దాదాపు 150 కిలో మీటర్ల వరకు విస్తరిస్తుంది. తమ గ్రామాలను కరీంనగర్ నగరపాలక సంస్థలో కలుపవద్దంటూ ఇప్పటికే చింతకుంట, గోపాల్‌పూర్, దుర్శేడ్, మల్కాపూర్ గ్రామాల్లో ఆందోళనలు చేయగా, మిగిలిన గ్రామాల ప్రజలు కూడా విలీనాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఉపాధి హామీ పథకం, ఆర్థిక సంఘం నిధులు గ్రామాలకు రాకుండా పోతాయని ఆయా గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

- పన్నుల భారం తప్ప ఒరిగేదేమీ లేదు
- కార్పొరేషన్‌లో కలుపడంపై ప్రజల్లో వ్యతిరేకత
- ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని మేయర్ లేఖ

● గతంలో ఎనిమిది గ్రామాలు విలీనం

2018లో ఆనాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కరీంనగర్ నగరపాలక సంస్థకు చేరువలోని పద్మనగర్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, సదాశివపల్లి, అల్గునూర్‌తోపాటు మల్కాపూర్ గ్రామపంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేస్తూ గెజిట్ విడుదల చేసింది. మల్కాపూర్ గ్రామాన్ని విలీనం చేయవద్దంటూ అప్పటి సర్పంచు కాసారాపు శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో అప్పటి మంత్రి గంగుల కమలాకర్ వద్దకు పెద్ద ఎత్తున గ్రామస్థులు తరలివచ్చి విలీనం చేయవద్దంటూ విజ్ఞప్తి చేశారు. దీనితో మల్కాపూర్ మినహా మిగిలిన ఎనిమిది గ్రామాలను కరీంనగర్‌లో కలిపి కార్పొరేషన్‌లో 60 డివిజన్లు చేసి ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుత బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చింతకుంట, మల్కాపూర్, బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామపంచాయతీలతో పాటుగా కొత్తపల్లి మున్సిపాలిటీని కూడా విలీనం చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. 2020 వరకు కరీంనగర్‌లో 50 డివిజన్లు, 28.5 కి.మీ. విస్తీర్ణంలో ఉండగా, గ్రామాల విలీనంతో డివిజన్ల సంఖ్య 60కి పెరిగింది. నగర విస్తీర్ణం 65 కిలో మీటర్లకు చేరుకుంది.

విలీన ప్రతిపాదనపై పునరాలోచన చేయాలి

మేయర్ యాదగిరి సునీల్‌రావు



నగరపాలక సంస్థలో గ్రామాల విలీన ప్రతిపాదనపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి. ఇప్పటికే ఐదేళ్ల క్రితం విలీనం చేసిన గ్రామాల్లో అభివృద్ధి ఆశించిన మేరకు జరుగలేదు. ఆయా డివిజన్‌లో కనీస సదుపాయాలు కూడా పూర్తిగా లేవు. పన్నులభారం పడుతోందంటూ ప్రజలు వాపోతున్నారు. గతంలో విలీనం చేసిన డివిజన్లకు ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి.

పన్నుల భారమే తప్ప ఒరిగేది ఏమీ లేదు

- కాసారపు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచు, మల్కాపూర్

నగరపాలక సంస్థలో విలీనం చేస్తే ప్రజలకు పన్నుల భారం తప్ప ఒరిగేదేమీ ఉండదు.. ఇప్పటికే విలీనం చేసిన గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరుగలేదు. అంతకుముందు నేరుగా వచ్చే ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. ఉపాధికూలీ పథకం అమలులో లేక కూలీలు ఉపాధి కోల్పోయారు. గతంలో ఆనాటి మంత్రి గంగుల కమలాకర్ తమ విజ్ఞాపన మేరకు విలీన ప్రతిపాదన విరమింపజేశారు.

దేశ రక్షణపై ప్రేమతో..



యువకులకు శిక్షణ ఇస్తున్న కె కుమార్

- యువకులు ఆర్మీలో చేరేలా ఉచిత శిక్షణ
- ఉద్యోగ విరమణ పొందిన సైనికుడి ఔదార్యం

కమాన్‌పూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కె కుమార్ చిన్నప్పటి నుంచే ఆటల్లో రాణించేవాడు. ఇంటర్ పూర్తికాగానే ఆర్మీ సెలక్షన్స్‌కు వెళ్లాడు. హవల్దార్‌గా ఎంపికై నాసిక్‌లోని 162 రెజిమెంట్‌లో శిక్షణ పూర్తిచేశాడు. శ్రీనగర్, జమ్ము-కశ్మీర్, కార్గిల్, లే, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, పంజాబ్, రాజస్థాన్ లాంటి ప్రాంతాల్లో విధులు నిర్వహించాడు. అస్సాంలో రెండుసార్లు ఉల్ఫా ఉగ్రవాదులతో, శ్రీనగర్‌లో ఒకసారి ఖలీస్థాన్ తీవ్రవాదులతో జరిగిన భీకర పోరులో పాల్గొని త్రుటిలో ప్రాణపాయం నుంచి తప్పించున్నాడు. కుమార్ మంచి క్రీడకారుడు కూడా. ఆర్మీ తరఫున బాక్సింగ్‌లో నేషనల్ టీమ్‌కు ఆడాడు. కుమార్ హాకీ పోటీల్లోనూ రాణించాడు. పదేహారేండ్ల సైనిక సేవ తర్వాత 2018లో ఉద్యోగ విరమణ పొందాడు.

● రిటైర్ అయినా..

ఉద్యోగ విరమణ పొందినా దేశరక్షణపై ప్రేమతో ఆర్మీ ఉద్యోగానికి సన్నద్ధమవుతున్న యువతకు శిక్షణ ఇస్తున్నాడు. రిటైర్ అయినా కుమార్ చొప్పదండిలోని రుక్మాపూర్ క్రీడ పాఠశాలలో ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. క్రీడా శిక్షణ ఇస్తూనే విద్యార్థులను శారీరకంగా రాటుదేలేలా తర్ఫీదునిస్తున్నాడు. నిత్యం వ్యాయామం, జాగింగ్ చేయిస్తూ యువత ఆర్మీలో చేరేలా ప్రోత్సహిస్తున్నాడు. కమాన్‌పూర్, చొప్పదండి ప్రాంతాల్లో ఆర్మీకి సిద్ధమవుతున్న యువకులకు మెళకువలు నేర్పుతున్నాడు. మరోవైపు అంబేద్కర్ సేవా సమితి పేరిట క్రీడా పోటీలు నిర్వహిస్తున్నాడు. ఆర్థికంగా వెనుకబడిన యువకులకు అండగా నిలుస్తున్నాడు.

దేశ ప్రజలకు సేవలందించడమే లక్ష్యం..

- మైనేని మధుకుమార్, అస్సాం రైఫిల్స్



దేశ ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా ఆర్మీ ఉద్యోగానికి లక్ష్యంగా పెట్టుకున్న సమయంలో రుక్మాపూర్ క్రీడ పాఠశాలలో పనిచేస్తున్న కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఆయన సూచనలు నాలో ఉత్సాహం నింపాయి. ఆయన ఇచ్చిన ట్రైనింగ్‌తో మూడు సంవత్సరాల వ్యవధిలోనే అస్సాం రైఫిల్స్‌లో హవల్దార్‌గా ఎంపిక అయ్యాను.

సరైన ట్రైనింగ్‌తోనే ఉద్యోగం..

- పవన్ కల్యాణ్, ఆర్మీ ఉద్యోగి, పెద్దపల్లి



నాకు చిన్నప్పటి నుంచి ఆర్మీలోకి వెళ్లాలని చాలా కోరిక ఉండేది. కానీ డబ్బులు ఇచ్చి కోచింగ్ తీసుకోలేకపోతున్నందుకు బాధపడేవాడిని. కుమార్‌సార్ ఉచితంగా కోచింగ్ ఇస్తున్నారని తెలుసుకొని ఆయనను కలిశాను. ఆయన సహకారంతో ఆర్మీలో ఉద్యోగం సాధించాను.

పేద విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నా..



- వాసాల రమేష్, కోచ్

ఆర్మీ ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకున్న నిరుపేద యువతకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు కుమార్ అకాడమి ఇన్‌చార్జీగా, కోచ్‌గా పనిచేస్తున్నాను. ఆర్మీ ఉద్యోగానికి సన్నద్ధయ్యేందుకు ఆర్థికంగా డబ్బులు లేని యువతకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నాం.

యువతను సన్మార్గంలో నడిపించేందుకే..

- కె. కుమార్, రిటైర్డు ఆర్మీ ఉద్యోగి, కమాన్‌పూర్



మంచిర్యాలలో ఎస్‌బీఐ గార్డ్ డ్యూటీ చేస్తూనే ఉచితంగా పలువురు యువకులకు ఆర్మీ కోచింగ్ ఇస్తున్నాను. నిరుపేద యువతను సైన్యం వైపు వెళ్లేలా చేసేందుకు కృషి చేస్తున్నా. నాతో పాటు ముగ్గురు కోచ్‌లు, ఇద్దరు టీచర్లు ఉన్నారు. వారి సహకారంతో మూడేళ్ల నుంచి యువతకు ఆర్మీ శిక్షణ ఇస్తున్నాను.

దాబాపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామ శివారులో కేసారి శ్రీనివాస్ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న దాబాపై టాస్క్‌ఫోర్స్ సీఐ సదన్‌కుమార్ ఆధ్వర్యంలోని పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. నిల్వ చేసిన 67 వేల రూపాయల విలువైన మద్యం సీసాలను స్వాధీనపర్చుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిర్వాహకుడు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని పోలీసు అధికారులు వెల్లడించారు. జిల్లాలో దాబాలు, హోటళ్లలో అక్రమంగా సిట్టింగ్‌లు నిర్వహించి మద్యం అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సదన్‌కుమార్ హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐ సుధాకర్, శిక్షణ ఎస్ఐ లక్ష్మణ్, సిబ్బంది తిరుపతి, రాజేశ్ పాల్గొన్నారు.


200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

ఎల్లారెడ్డిపేట డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్, గుండారం గ్రామాల్లోని గిరిజన తండాలపై ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా బుధవారం దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వ చేసిన 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. రవాణాకు సిద్ధంగా ఉన్న ఐదు లీటర్ల నాటు సారా, తయారీకి వినియోగించే 20 కిలోల బెల్లాన్ని స్వాధీనపరుచుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని సిఐ శ్రీనివాస్ వివరించారు.

పీఎం కిసాన్ లింకుతో ముగ్గురి ఫోన్లు హ్యాక్

గన్నేరువరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు పంపించిన పీఎం కిసాన్ లింకుతో మండలంలో ముగ్గురి వ్యక్తుల ఫోన్‌లు బుధవారం హ్యాక్‌కు గురయ్యాయి. మండల కేంద్రానికి చెందిన బూర వెంకటేశ్వర్ ఫోన్ హ్యాక్ గురై తన పేరుతో మండలంలోని పలు వాట్సాప్ గ్రూపుల్లో పీఎం కిసాన్ లింక్ పంపినట్లు వచ్చింది. లింక్‌ను అదే గ్రామానికి చెందిన బోయిన శ్రీనివాస్, మైలారం గ్రామానికి చెందిన కాదసి కుమారస్వామి లింక్‌ను ఓపెన్ చేశారు. ఫోన్‌లో వాట్సాప్, ఫోన్‌పే, గూగుల్‌పే, ఇతర యాప్‌లు పనిచేయకపోవడంతో తమ ఫోన్‌లు హ్యాక్‌కు గురయ్యాయని గుర్తించారు. విషయాన్ని బ్యాంక్ అధికారులకు తెలిపి వారి ఖాతాలను హోల్డ్‌లో పెట్టించారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సైబర్ మోసాలకు గురైతే 1930టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదుచేయాలని ఎస్ఐ నరేష్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



రాములు(ఫైల్)

రుద్రంగి, డిసెంబరు, 18 (ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన రుద్రంగి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలోని ప్రదాన రహదారిపై బుధవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన కంటే రాములు(70) అనే వ్యక్తి కేడీసీసీ బ్యాంక్ నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. బస్టాండ్ వద్ద యూ టార్న్ తీసుకుంటున్న సమయంలో ఇదే గ్రామానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలుడు ఇందిరాచౌక్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వైపు ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళ్తూ రాములు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో రాములు తలకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో రాములు మృతి చెందాడు. బాలుడికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు రాములు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిరిసిల్ల ఆశోక్ తెలిపారు.

లారీ, ద్విచక్రవాహనం ఢీకొని.. ముగ్గురికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థులు

సుల్తానాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ పరీక్షలు కోసం వెళుతున్న విద్యార్థులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ద్విచక్ర వాహనంపై వెళుతూ లారీని ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దపల్లి ప్రగతినగర్‌కు చెందిన వల్లెపు జాన్ ప్రకాష్, కరుణాకర్, సుల్తానాబాద్‌కు చెందిన కొయ్యడ భాను ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వెళుతున్నారు. సుల్తానాబాద్ మండలంలోని దుబ్బపల్లి వద్ద యూ టర్న్ తీసుకుంటున్న లారీని ద్విచక్రవాహనంపై వెళుతున్న యువకులు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న జాన్ ప్రకాష్‌తో పాటు కరుణాకర్, కొయ్యడ భాను కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 అంబులెన్స్ ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న జాన్‌ప్రకాష్ ప్రస్తుతం పరీక్షలు రాస్తున్నాడు. బుధవారం పరీక్ష ఉండడంతో పెద్దపల్లి నుంచి ఉదయం ఏడుగంటల ప్రాంతంలో కరుణాకర్‌తో కలిసి కరీంనగర్ బయలుదేరారు. మార్గమధ్యలో సుల్తానాబాద్‌లో వారి స్నేహితుడు కొయ్యడ భానును కూడా ఎక్కించుకుని పరీక్షలు రాయడానికి కరీంనగర్ బయలుదేరగా దుబ్బపల్లి వద్ద ప్రమాదం జరిగింది. జాన్ ప్రకాష్ తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

సారంగాపూర్, డిసెంబరు, 18 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ అటవీ ప్రాంతంలో బైక్ అదుపుతప్పి ఓ యువకుడు బుధవారం గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బట్టపెల్లి గ్రామానికి చెందిన దాసరి సునీల్ అనే యువకుడు జగిత్యాల నుంచి తన బైక్ పై బట్టపెల్లికి వస్తున్న క్రమంలో సారంగాపూర్ అటవీ ప్రాంతంలో రాత్రి సమయంలో ఒక్కసారిగా బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టాడు. దీంతో సునీల్ తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయాడు. గమనించిన వాహన దారులు అంబులెన్స్ సహాయంతో జగిత్యాల ఆస్పత్రికి తరలిలించారు.

దుబాయ్‌లో బస్సు బోల్తా.. మల్లాపూర్ వాసి మృతి

మల్లాపూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలానికి చెందిన మాణాల అశోక్(48) నాలుగు రోజుల క్రితం దుబాయ్‌లో జరిగిన బస్సు ప్రమాద సంఘటనలో తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. అశోక్ జీవనోపాధి కోసం గతంలో బెహ్రాయిన్ దేశం వెళ్లి తిరిగి సంవత్సరం కింద ఇంటికి వచ్చాడు. మళ్లీ నాలుగు నెలల కిందట దుబాయ్ వెళ్లాడు. దుబాయ్‌లో ఈనెల 15 రాత్రి బస్సు బోల్తా పడ్డ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స పొందుతున్న అశోక్ బుధవారం మృతి చెందాడు. అశోక్‌కు భార్య లక్ష్మీ, కుమార్తెలు భావన, సాయిహర్షిని, సాయికీర్తనలు ఉన్నారు.

పవర్‌లూం కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన కర్గాతం శ్రీనివాస్ (46) అనే పవర్‌లూం కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... బీవైనగర్‌కు చెందిన శ్రీనివాస్ పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఏడునెలలుగా పనిలేక అనారోగ్యం పాలై మద్యానికి అలవాటు పడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అనారోగ్యంతో ఉన్న కార్మికుడు ఇంట్లోనే ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి ఒడిగట్టాడు. శ్రీనివాస్‌కు రెండు పెళ్లిల్లు అయినప్పటికీ భార్యలు వెళ్లిపోయారు. తండ్రి 20 సంవత్సరాల క్రితమే మృతిచెందడంతో శ్రీనివాస్ తల్లితో పాటు ఉంటున్నాడు. ఏడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ కె కృష్ణ తెలిపారు.

వేములవాడలో యువకుడి దారుణ హత్య

- 25 చోట్ల కత్తిపోట్లు - వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసిన వైనం - పోలీసుల అదుపులో నిందితుడు





మృతుడు రషీద్ (ఫైల్), విచారణ జరుపుతున్న పోలీసులు

వేములవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వివాహే తర సంబంధం కొనసాగిస్తున్నాడన్న కారణంతో ఓ యువకుడిని సినీ ఫక్కీలో వేటాడి.. వెంటాడి దారుణంగా హత్య చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. జిల్లాలోని వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన మహమ్మద్ రషీద్ (35) గతంలో వేములవాడలో నివసించేవాడు. ప్రస్తుతం గంగాధరలో డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. రషీద్ వేములవాడ పట్టణానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయంలో ఏడాది క్రితమే ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. మహిళ భర్త గల్ఫ్‌లో ఉంటున్న నేపథ్యంలో రషీద్ ఆమెతో సన్నిహితంగా ఉంటూ వస్తున్నాడు. ఇరువురి మధ్య వివాహేతర సంబంధం విషయంలో జరిగిన గొడవలు పోలీస్ స్టేషన్ వరకు వెళ్లాయి. తనకు భర్తతో కలిసి ఉండడం ఇష్టం లేదంటూ ఆమె ఇటు అత్తగారింటికి, అటు తల్లిగారింటికి వెళ్లడం లేదు. వేములవాడ పట్టణంలోని అర్బన్ కాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ రషీద్‌తో సన్నిహిత సంబంధం కొనసాగిస్తోంది.

● గల్ఫ్ నుంచి వచ్చి..

మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న భార్య తీరుపై ఆగ్రహంతో ఉన్న భర్త నెల రోజుల క్రితం గల్ఫ్ నుంచి తిరిగి వచ్చాడు. రషీద్‌ను ఎలాగైనా అంతమొందించాలనుకున్నాడు. మంగళవారం రాత్రి తన భార్య ఉంటున్న న్యూ అర్బన్ కాలనీలోని ఇంటికి రషీద్ వచ్చినట్లు తెలుసుకొని రాత్రంతా అక్కడే మాటు వేశాడు. బుధవారం తెల్లవారుజామున రషీద్ బయటకు రావడంతోనే కత్తితో దాడి చేశాడు. తప్పించుకునేందుకు రషీద్ సుమారు 300 నుంచి 400 మీటర్లు వరకు పరుగెత్తాడు. తనను చంపుతున్నారని కాపాడాలంటూ సమీప బంధువులకు ఫోన్ చేశాడు. ఈలోగానే వివాహిత భర్త వెంటపడి దాడి చేసి అత్యంత కిరాతకంగా నరికి చంపాడు. సంఘటనస్థలానికి చేరుకున్న బంధువులు రషీద్‌ను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రషీద్‌ను హత్య చేసే క్రమంలో వివాహిత భర్త మృతుడి తలపై 15 చోట్ల, శరీరంపై మరోపది చోట్ల కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలైనట్లు పోలీసులు గుర్తించారు. మృతుడు రషీద్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. హత్య చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలంటూ రషీదు కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, ఎస్పీ విభాగం డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్సైలు రమేష్, మారుతి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. హత్యకు పాల్పడిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కమ్మ కత్తితో ఒకరిపై దాడి

- కాలువ నీటి విషయంలో గొడవ

చందుర్తి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి వద్ద కాలువ నీరు విషయంలో ఒకరిపై ఒకరు కమ్మ కత్తితో దాడి చేసిన సంఘటన చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మారుపాక నర్సయ్యపై అదే గ్రామానికి చెందిన రాజేశం అనే వ్యక్తి కాలువ నీటి విషయంలో గొడవ పడ్డారు.

రాజేశం కమ్మ కత్తితో దాడి చేయడంతో నర్సయ్యకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వేములవాడలోని అంబలెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తాగి వచ్చిన భర్తను చితకబాదిన భార్య

- దెబ్బలకు తాళలేక మృతి

కొడిమ్యాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని పూడూర్ గ్రామంలో నిత్యం మద్యం తాగి వచ్చి గొడవకు దిగుతున్న భర్తను భార్య చితకబాదింది. ఆ దెబ్బలకు తాళలేక భర్త బుధవారం ఉదయం మృతి చెందాడు. కొడిమ్యాల ఎస్సై సందీప్ తెలిపిన వివరాల మేరకు పూడూర్ గ్రామానికి చెందిన పెద్ది రాజశేఖర్(33)కు నర్మదకు ఆరేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఒక కూతురు, కొడుకు ఉన్నాడు. రాజశేఖర్ కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం తాగి వచ్చి ఇంట్లో భార్య నర్మద, తల్లి కొమురవ్వపై దాడి చేసేవాడు. మంగళవారం రాత్రి కూడా తాగి ఇంటికి వచ్చి తల్లి, భార్యతో గొడవ పడ్డాడు. దీంతో భార్యతో పాటు తల్లి రాజశేఖర్‌ను తీవ్రంగా కొట్టారు. అనంతరం నర్మద తమ్ముడు మహేందర్ కు రాత్రి విషయం తెలుపడంతో ముగ్గురూ కలిసి రాజశేఖర్‌ను బాత్రూంలో వేసి తాళం వేశారు. బుధవారం ఉదయం బాత్రూంలో చూసేసరికి అప్పటికే చనిపోయి ఉన్నాడు. మృతుడి తండ్రి పెద్ది మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూ సేకరణకు రైతులు సహకరించాలి

- ఆర్డీవో మధుసూదన్

వెల్గటూర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్రం గ్రీన్ ఫీల్డ్ హైవే పేరిట చేపట్టిన జాతీయ రహదారి 63 విస్తరణకు చేపట్టిన భూ సేకరణకు రైతులు సహకరించాలని ఆర్డీవో మధుసుదన్ కోరారు. బుధవారం వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంలో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమాబాద్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల వరకు ఎన్‌హెచ్-63 విస్తరణ పనుల్లో భాగంగా మండలంలోని స్తంభంపల్లి, కొత్తపెల్లి గ్రామాల్లో 40 మంది రైతులు 33 ఎకరాలు భూములు కోల్పోతున్నారని తెలిపారు. మొదటి విడతలో 21 ఎకరాలు కోల్పోతున్న రైతులకు నోటీసులు అందజేశామని వారు స్టేట్‌మెంట్ ఇచ్చారని తెలిపారు.

అదనంగా మరో 12 ఎకరాలు కోల్పోతున్న రైతులకు ఇటీవలే నోటీసులు అందజేశామన్నారు. రైతులకు ఏమన్నా అభ్యంతరాలు ఉంటే తెలుసుకోవడానికి సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు నష్టపరిహారం అందజేస్తామన్నా రు. ప్రభుత్వం అందజేసే పరిహారం నచ్చకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ కొంత మేరకు పరిహారం పెంచే అవకాశం ఉంటుందని సూచించారు. తన స్థాయిలో రైతులు నష్ట పోకుండా చూస్తానని అన్నారు.

● భూములు తీసుకొని పొట్ట కొట్ట వద్దు

రోడ్డు విస్తరణ పనుల పేరిట భూములు తీసుకొని తమ పొట్ట కొట్టవద్దని రైతులు మండి పడ్డారు. ఇప్పటికే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పేరిట భూములు కోల్పోయామని వాపోయారు. ఉన్న కాస్త భూములు సాగు చేసుకుంటూ బతుకుతుంటే ఇప్పుడు గ్రీన్ ఫీల్డ్ హైవే పేరిట రోడ్డు విస్తరణకు భూములు తీసుకుంటే ఎలా బతకమంటారని అధికారులను ప్రశ్నించారు. భూములు ఎట్టి పరిస్థితిలో ఇవ్వమని తెగేసి చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, ఎంపీవో శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్టు



అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజు

మంథని/ముత్తారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముత్తారంలో గంజాయి మొక్కలు పెంచుతున్న రేపాల గట్టయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు మంథని సీఐ రాజు బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తారం ఎస్ఐ నరేష్‌కు అందిన సమాచారం మేరకు ఏవోతో కలిసి వెళ్లి రేపాల మల్లయ్య ఇంటి అవరణలో 12 గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు గుర్తించారన్నారు. ఎస్ఐ నరేష్ ఆ మొక్కలను స్వాధీనం చేసుకొని గట్టయ్యను పోలీసు స్టేషన్‌కు తరలించారన్నారు. కేసు నమోదు చేసిన అరెస్టు చేసి మంథని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని తెలిపారు. మంథని పోలీసు సర్కిల్ పరిధిలోని మంథని, ముత్తారం, రామగిరి మండలాల్లో ఎవరైన నిషేధిత గంజాయి అమ్మినా కొన్నా, ఉపయోగించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బోరు బావుల తవ్వకాలకు భూమి పూజ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పలు ఆలయాల్లో బోరుబావుల తవ్వకానికి బీజేపీ నాయకులు బుధవారం భూమి పూజ చేశారు. మడేలేశ్వరస్వామి ఆలయం ఆవరణ, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన వ్యవసాయ భూమిలో బోరు బావుల తవ్వకానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ సంజయ్‌కుమార్ నిధులు కేటాయించారు. నీటి వసతి కల్పించేందుకు నిధులు కేటాయించిన బండి సంజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపి, తిరుపతి, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, నరేశ్, రమేశ్, రాంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజిరెడ్డి, కిరణ్, వేణు, నర్సయ్య, పోచయ్య, హన్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సింగిరెడ్డి నరేష్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ గల్ఫ్ వలసదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరేష్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆరోగ్యకరమైన వలసలు సమాజ శ్రేయస్సుకి, అభివృద్ధికి దోహదపడతాయన్నారు. సంస్కృతి ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి చేరువకావడానికి వలసలు దోహదపడతాయన్నారు. అనంతరం గల్ఫ్ జేఏసీ అధ్యక్షుడు గుగ్గిల్ల రవిగౌడ్ మాట్లాడుతూ వలసదారుల ద్వారా దేశ ఖజానాకు ఆర్థిక వనరులు సమకూరుతున్నా ప్రభుత్వాలు మాత్రం వలసదారులపై అవలంబించే విధానాలు మారకపోవడం దురదృష్టకరం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కృషి చేయడం అభినందనీయం అన్నారు. కేంద్రప్రభుత్వం సైతం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి తోడ్పాటును అందించాలని కోరారు. కార్యక్రమంలో మంద భీంరెడ్డి, ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి, బూట్కూరి కాంతక్క, మధు, పల్లికొండ ప్రవీణ్, తిరుపతి, రాజిరెడ్డి, చంద్రశేఖర్, తిరుపతి, నాగరాజు తదితరులు ఉన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బొమ్మ రవి అనే గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రవి వృత్తిలో భాగంగా బుధవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారీ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సర్వాయి పాపన్న జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మటి రాజమల్లుగౌడ్, మండలాధ్యక్షుడు దేవేందర్‌గౌడ్ రవిని పరామర్శించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రవిని ప్రభుత్వం వెంటనే ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని కోరారు.

అక్రమంగా మట్టి తరలించిన వ్యక్తిపై కేసు నమోదు

గన్నేరువరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కెనాల్ మట్టిని తరలించిన ఎక్స్‌కావేటర్ యజమానిపై కేసు నమోదు అయింది. ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చెందిన పొన్నాల మధు మంగళవారం రాత్రి అక్రమంగా గ్రామశివారులోని కెనాల్ మట్టిని తవ్వి తన పొలంలో పోసుకుని చదును చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకుని ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఇరిగేషన్ ఏఈఈ మహేందర్ ఫిర్యాదు మేరకు అక్రమంగా మట్టిని తరలించడమే గాకుండా అడ్డుకున్న గ్రామస్థులను బెదిరించాడని పొన్నాల మధుపై కేసు నమోదు చేశామని, ఎక్స్‌కావేటర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పల స్వాధీనం

కోరుట్ల రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుక నిల్వలతో పాటు రెండు ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గ్రామ శివారులోని అక్రమంగా నిల్వ ఉన్న 50 ఇసుక కుప్పలను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ రాజేందర్ రావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గ్రామ శివారులో ఉన్న ఇసుక నిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో కల్లూర్ గ్రామం నుంచి కోరుట్లకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను అధికారులు పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. సీజ్ చేసిన ఇసుక కుప్పలను త్వరలో వెలం వేయనున్నట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

వేములవాడ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకుని సీజ్ చేసి ఆర్టీసీ డిపోకు తరలించినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలానికి చెందిన ఓ ఇసుక లారీ వేములవాడ నందికమాన్ మీదుగా కామారెడ్డి వెళ్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతులకు లోబడి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా మూడు రోజుల క్రితం మరో రెండు ఇసుక లారీలు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. వే బిల్‌లో లారీ నంబర్ ఒకటి ఉంటే లారీ ట్రాలీపైన వేరే నంబర్‌తో జోరుగా ఇసుక దందా జరుగుతుండటంతో సంబంధిత అధికారులు అట్టిముట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడివారిపై చర్యలు తీసుకుని అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

వైభవంగా సంకటహర చతుర్థి పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గల గణపతి ఆలయంలో సంకటహర చతుర్థి పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్ శర్మ, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అభిషేకం, విశేష పూజలు, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డిపో పరిధిలోని ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా సర్వీసులను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుష్రోస్ షా ఖాన్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని డిపోను సందర్శించారు. డిపో నుంచి నడిపే బస్సు రూట్ల వివరాలను తెలుసుకున్నారు. టీజీఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు, డిప్యూటీ ఆర్‌ఎం(ఓ)భూపతిరెడ్డి, సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాష్ ఉన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కొడిమ్యాల కానిస్టేబుల్ కల్యాణ్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ అశోక్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఓ కేసు విషయంలో కోర్టును తప్పుదోవ పట్టించాడనే ఆరోపణపై విచారణ నిర్వహించిన పోలీసులు ఆరోపణ రుజువు కావడంతో సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఇదే విషయమై సదరు కానిస్టేబుల్‌పై జగిత్యాల పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

హాకీ @హుజూరాబాద్

హాకీతో హుజూరాబాద్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. 60 ఏళ్ల క్రితం చిన్నగా మొదలైన ప్రయత్నం నేడు ఎంతో మందిని క్రీడాకారులను చేసింది. ఇక్కడి క్రీడాకారులు జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. వారిని స్ఫూర్తిగా తీసుకున్న స్థానిక యువకులు క్రీడలో నైపుణ్యం పొంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేకున్నా ఉన్న వనరులతో ఆట నేర్చుకుని హుజూరాబాద్ పట్టణానికే ప్రత్యేక గుర్తింపు తెచ్చారు.

హుజూరాబాద్‌లో హాకీ ఆడుతున్న క్రీడాకారులు



- క్రీడతో 60 ఏళ్ల అనుబంధం
- ప్రతిభ చాటుతున్న క్రీడాకారులు
- శిక్షణతో మరింత మంది ముందుకు


హుజూరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హాకీ క్రీడకు హుజూరాబాద్ చిరునామాగా మారింది. ఎంతో మంది క్రీడాకారులు ఇక్కడ ఆట నేర్చుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి అండర్-14 బాల బాలికల క్రీడల్లో తెలంగాణ రాష్ట్రం తరుపున హుజూరాబాద్ క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిరోజు హైస్కూల్ మైదానంలో సీనియర్ క్రీడాకారులు యువతకు శిక్షణ ఇస్తున్నారు. హాకీ క్రీడల క్లబ్ అధ్యక్షుడిగా తోట రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా గుడ్డెల్లుల సమ్మయ్యలు వ్యవహరిస్తున్నారు. వీరితో పాటు కొలిపాక శ్రీనివాస్, బండ శ్రీనివాస్, గనిశెట్టి ఉమయ్యలు ప్రస్తుతం క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు.

● హాకీవైపు అడుగులు

హుజూరాబాద్‌కు హాకీ క్రీడలకు విడదీయలేని అనుబంధం ఉంది. 60ఏళ్ల క్రితం హైస్కూల్‌లో జి. పాండురంగచారి ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అతనికి హాకీపై మక్కువ ఉండేది. ఈ క్రమంలో స్కూల్ విద్యార్థులతో పాటు స్థానిక యువతకు క్రీడల వైపు దృష్టి మళ్లించాడు. ఆయన కృషితోనే హాకీ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఉన్నత స్థాయికి ఎదిగారు. మొదట్లో రాజారి రాములు, కృష్ణమూర్తి, శంకర్, సత్తయ్య, రాఘవులు, శేఖరయ్య, మిఠాయి రాములు, శ్రీశైలం, రమణయ్య, సత్యనారాయణ, ఆఫీస్, ఉస్మాన్‌ఖాన్, అలీ, నవాజ్, ముస్తాక్, హుస్సేన్, వర్షిర్‌అహ్మద్, తుపాకుల మొగిలయ్య, కందుల ఆదిరెడ్డి, నల్ల సుధాకర్‌రెడ్డి, బిక్షపతి, లక్ష్మినారాయణ, మోటపోతుల రమేష్, తాళ్లపల్లి సమ్మయ్య, మోహన్‌లాల్ లాంటి వారు 11మంది జట్టు గా హాకీ ఆడేవారు. ఆ తర్వాత వారి పిల్లలతో పాటు మరికొంత మంది హాకీ క్రీడాకారులు తయారయ్యారు. ఇక్కడి నుంచే హాకీ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా స్థిరపడ్డారు. వారి పిల్లలతో పాటు కొత్తగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు హాకీ క్రీడల్లో పాల్గొంటున్నారు. ఒక మోటపోతుల రమేష్ కుటుంబంలో నలుగురు కుమారులు హాకీ క్రీడల్లో గుర్తింపు పొందారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో తిరణహరి శ్రీనివాస్ అనే హాకీ క్రీడాకారుడు 15ఏళ్లుగా విద్యార్థులకు కోచింగ్ ఇస్తున్నారు. ఇటీవల హుజూరాబాద్‌లో రాష్ట్రస్థాయి హాకీ క్రీడలు జరగగా, కరీంనగర్ జట్టు గెలవగా, అందులోని క్రీడాకా రులు హుజూరాబాద్‌కు చెందిన వారే కావడం విశేషం.

● ఎందరో ప్రతిభావంతులైన క్రీడాకారులు

హుజూరాబాద్ హాకీ మైదానంలో ప్రతిభావంతులైన క్రీడాకారులు నేటితరంలో ఎందరో ఉన్నారు. అందులో మాటూరి కిరణ్, జగదీష్, సన్ని, నితిన్‌రెడ్డి, పవన్, సుమలత, రజిత, వైష్ణవి, వినీత్, విపుల్, వినయ్, నాగరాజు, రిషిత, సాజిత్, అరుణ్‌కుమార్, నిమ్మటూరి మిథున, రోహన్, రుత్విక్, మేఘన, దత్తాత్రేయ, శివసం తోషిని, రామచరణ్, గోలి నిపునిత, సంజయ్ సబ్ జూనియర్ జాతీయ పోటీల్లో తెలంగాణ జట్టు తరుపున ఆడి గుర్తింపు పొందారు.



జాతీయ స్థాయి హాకీ పోటీల్లో ఆడాను

- గాజ వెంకటేష్, హాకీ క్రీడాకారుడు, హుజూరాబాద్

హుజూరాబాద్ హైస్కూల్ మైదానంలో హాకీ నేర్చుకున్నా. హుజూరాబాద్ తరుపున సబ్ జూనియర్, నేషనల్ జూనియర్స్, సీనియర్స్‌లో వరుసగా మూడుసార్లు జాతీయ స్థాయి హాకీ క్రీడల్లో ఆడాను. హాకీతో నాకు ప్రభుత్వ ఉద్యోగం లభించింది. ప్రస్తుతం ముంబైలోని నేవీలో పని చేస్తున్నా.





అండర్-14 జాతీయస్థాయి హాకీ క్రీడల్లో ఆడాను

- నిమ్మటూరి మిథున, హాకీ క్రీడాకారు, హుజూరాబాద్

ఇటీవల హుజూరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొన్నాను. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో మధ్యప్రదేశ్‌లో జరి గిన అండర్-14 ఎస్‌ఎఫ్ జాతీయ స్థాయి హాకీ టోర్న మెంట్‌లో పాల్గొ న్నాను. హుజూరాబా ద్‌లో సీనియర్ క్రీడాకారుల ప్రోత్సా హంతో రాణిస్తున్నాను.

క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాను.

- మాటూరి రాజేష్, క్రీడాకారుడు, హుజూరాబాద్

2000సంవత్సరంలో గుజరాత్‌లోని గాంధీనగర్ రూరల్‌లో జరిగిన జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొన్నాను. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించి ములుగు జిల్లాలో జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ఆడిటర్‌గా పనిచేస్తున్నాను. ప్రస్తుతం ఆలిండియా సివిల్ సర్వీస్ సెక్ర టేరియట్ తెలంగాణ టీమ్‌లో ఆడుతున్నాను.



ఎన్టీపీసీ ప్రజాభిప్రాయ సేకరణ మరోసారి వాయిదా

జ్యోతినగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించ నున్న తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ) స్టేజ్-2కు సంబంధించి గురువారం నిర్వహించాల్సిన ప్రజాభిప్రా య సేకరణ మరోసారి వాయిదా పడింది. నవంబర్ 29న మొదటిసారి ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉండగా జిల్లాలో సీఎం పర్యటన కారణంగా వాయిదా పడింది. ఈ క్రమంలో గురువారం నిర్వహించాల్సిన పబ్లిక్ హియరింగ్ మరో సారి వాయిదా పడింది. అసెంబ్లీ సమావే శాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేసినట్లు తెలుస్తున్నది. తిరిగి పబ్లిక్ హియరింగ్ ఎప్పుడు నిర్వహించేది కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) ప్రకటించాల్సి ఉంది.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 'ఆదర్శ' విద్యార్థినికి బ్రాంజ్ మెడల్



మెడల్‌తో భూక్యా శ్రావణి

ధర్మపురి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మగ్గిడి ఆదర్శ కళాశాల విద్యార్థిని భూక్యా శ్రావణి నేషనల్ ఫెడరేషన్ కప్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించింది.

ఈ నెల 17న ఢిల్లీలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆమె ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో శ్రావణి అత్యంత ప్రతిభ కనబరచి బ్రాంజ్ మెడల్ సాధించింది. శ్రావణిని ప్రిన్సిపల్ పద్మ, వైస్‌ప్రిన్సిపల్ మహేష్, ఫిజికల్ డైరెక్టర్ రాజేందర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు అభినందించారు.

వర్గీకరణపై ప్రభుత్వానికి నివేదిక

- ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్
- ఎస్సీ ఉప వర్గీకరణపై బహిరంగ విచారణ
- షెడ్యూల్డ్ కులాల నుంచి 128 దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్సీ కులాల ఉప వర్గీకరణ కోసం నిర్వహించిన బహిరంగ విచారణలో తమ దృష్టికి వచ్చిన అభ్యర్థనలపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో ఎస్సీ ఉప వర్గీకరణపై బహిరంగ విచారణ నిర్వహించారు. వర్గీకరణపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని వివిధ ఎస్సీ కుల సంఘాలు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ వివిధ ఎస్సీ కుల సంఘాల నుంచి 128 వినతులు, అభ్యర్థనలు అందాయని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన న్యాయపరమైన అంశాలు, ఉద్యోగ, సామాజిక పరిస్థితులు, చారిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల కుల సంఘాల అభ్యర్థన లు, వినతులు సేకరించి ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందిస్తామని పేర్కొన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల నుంచి ఎస్సీ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం సోషల్ వెల్ఫేర్‌శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు, ఆర్డీవో కే మహేశ్వర్, జగిత్యాల డీఎస్‌డీవో రాజ్‌కుమార్, సిరిసిల్ల డీఎస్‌డీవో విజయలక్ష్మి, ఎస్‌డబ్ల్యూవోలు తిరుపతి, విజయపాల్‌రెడ్డి, పలువురు అధికారులు, వివిధ ఎస్సీ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం స్వీకరిస్తున్న ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

ధర్మపురి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులు సింధూజ, ముస్కాన్, సిద్దిక, అక్షయ, లస్మిత్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఐదుగురు విద్యార్థినులు ఫుట్‌బాల్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినులు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ జ్యోతి, పీఈటీ భారతి, ఆర్ఎల్‌సీ రాజేందర్, డీఎండబ్ల్యూ చిత్రు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

అయ్యప్ప ఆలయంలో లక్ష పుష్పార్చన

రాయికల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో అయ్యప్ప ఆలయం నిర్మించి 22 ఏళ్ల పూర్తయిన సందర్భంగా సాయప్ప ట్రస్టు చైర్‌పర్సన్ సీహెచ్‌ఎస్‌వీ నివేదిత కృష్ణారావు, వైస్‌చైర్మన్ హిమవంతరావు ఆధ్వర్యంలో ఆలయంలో అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కోరుట్లలో గీతా యజ్ఞాలు

కోరుట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గీతా యజ్ఞాలతో కోరుట్ల ప్రాంతం ఆధ్యాత్మికతను సంతరించుకుంటోంది. 20 ఏళ్ల నుంచి గీతా సత్సంగ్, సుందర సత్సంగ్ ఆధ్వర్యంలో శ్రీమద్భగవ ద్గీతపై ప్రచారం చేస్తున్నారు. గీతా కంఠస్థ శిక్షణ తరగతులు నిర్వహిస్తూ భక్తి భావనలు పెంపొందిస్తున్నారు. గీతా సత్సంగ్ వ్యవస్థాపకుడు చీలమంతుల చత్రపతి ఆధ్వర్యంలో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలతో పాటు పలు మండలాల వారికి శిక్షణను అందిస్తూ అభి నందనలు అందుకుంటున్నారు. కోరుట్ల పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయంలో ప్రతి శనివారం ఉదయం గీతా కంఠస్థ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఆదివారం మురళి కృష్ణ ఆలయంలో విద్యుత్ శాఖ రిటైర్డ్ ఎస్ఈఈ దొంతుల రాంకిషన్ ఆధ్వర్యంలో ఉదయం, ఆదే విధంగా కోరుట్ల మండలం, మెట్‌పల్లి పట్టణం, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాలలో కంఠస్థ తరగతులను నిర్వహిస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న డీఈవో మాధవి

ముత్తారం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని తొగరి సహస్ర రాష్ట్రస్థాయి టాలెంట్ పోటీలకు ఎంపికైంది. పెద్దపల్లిలో బుధవారం జీవ శాస్త్రంపై జిల్లాస్థాయి టాలెంట్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. ఈనెల 28న హైదరాబాద్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సహస్రకు డీఈవో మాధవి ప్రశంసాపత్రం అందించి అభినందించారు. ముత్తారం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న విద్యార్థిని, జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు తోట రాధిక అభినందించారు.

కారు అద్దాలు ధ్వంసం.. కేసు నమోదు

కరీంనగర్ క్రైమ్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కార్ఖానాగడ్డ గాంధీ చౌరస్తాలో బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో కారు అద్దాలను ధ్వంసం చేసి డ్రైవర్‌పై చేయిచేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తుండగా మరో వ్యక్తి వచ్చి కారు డ్రైవర్‌పై దాడి చేసి, కారు అద్దాలు ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు.

సమసిపోయిన ఎన్టీపీసీ బూడిద వివాదం

- రూ.20కోట్ల సీఎస్ఆర్ నిధులు ఇచ్చేందుకు అంగీకారం

గోదావరిఖని, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ యాష్‌పాండ్ బూడిద తరలింపు వివాదానికి తెరపడింది. ఎన్టీపీసీ నుంచి ఈ ప్రాంత అవసరాలకు, అభివృద్ధికి రావాల్సిన నిధులు మంజూరు కాకపోవడంతో బూడిద తరలింపును నిలిపివేశారు. రెండు నెలలుగా ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి ఎన్‌హెచ్ హైవేల కోసం తరలించాల్సిన బూడిద లారీలు నిలిచిపోయాయి. ఎన్టీపీసీ 15లక్షల టన్నుల బూడిద తరలింపునకు ఆన్‌లైన్‌లో పిలిచిన టెండర్ల బూడిద ట్రాన్స్‌పోర్టు కూడా నిలిచిపోయింది. దీంతో రోజూ ఐదు వేల టన్నుల చొప్పున సుమారు రెండున్నర లక్షల టన్నుల బూడిద యాష్‌పాండ్‌లో పేరుకుపోయింది. దీంతో ఆందోళన చెందిన ఎన్టీపీసీ యాజమాన్యం ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. బుధవారం రామగుండం ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం రూ.20కోట్ల సీఎస్ఆర్ మంజూరు చేస్తామని ఎన్టీపీసీ ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో ఈ వివాదం సమసిపోయింది. ఒకటి రెండు రోజుల్లో ఎన్టీపీసీ యాష్‌పాండ్ నుంచి బూడిద తరలింపునకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఎన్టీపీసీ ఉన్నతాధికారులు బుధవారం అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు చాంబర్‌లో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు ఈ మేరకు హామీ ఇచ్చినట్టు తెలిసింది. దీంతో ఈ వివాదానికి తెరపడింది.

బెనిఫిట్స్‌పై కమిటీ పేరుతో ప్రభుత్వం కాలయాపన



పెన్షనర్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

తిమ్మాపూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు రావాల్సిన బెనిఫిట్స్ చెల్లించకుండా, బెనిఫిట్స్‌పై కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని రిటైర్డ్ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య అన్నారు. జాతీయ పెన్షనర్స్ డే పురస్కరించుకొని మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల రిటైర్డ్ పెన్షనర్ల సంఘ భవనంలో ఎల్ఎండీ యూనిట్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి గాజుల నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదవీవిరమణ పొందిన పెన్షనర్లకు రావలసిన పీఆర్సీ, డీఏలు, ఇతర బెనిఫిట్స్‌పై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం ఎల్ఎండీ యూనిట్ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల సత్యనారాయణ, మన్నే జయచందర్ ఆధ్వర్యంలో రిటైర్డ్ పెన్షనర్ల ను సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ పెన్షనర్ల జిల్లా అధ్యక్షుడు పెండ్యాల కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడు చల్లా మోహన్‌రెడ్డి, సెక్రెటరీ ఇ లింగయ్య, కోశాధికారి ఎస్ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ఐఎఫ్ నిధుల కోసం వినతి

- కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందిస్తున్న బండి సంజయ్

కరీంనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని గ్రామాలకు 224 కోట్ల రూపాయల సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) నిధులు మంజూరు చేయాలని కేంద్ర రోడ్లు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ బుధవారం వినతిపత్రం అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సదుపాయం మెరుగు పర్చేందుకు సీఆర్ఐఎఫ్) నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ నియోజక వర్గంలోని గ్రామీణ రోడ్లు, వంతెనల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై గడ్కరీ దృష్టికి తీసుకు వచ్చారు. సింగిల్ లేన్ రోడ్లను డబుల్ లేన్ రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి ప్రతిపాదన చేశారు. ప్రధానంగా కేశవపట్నం, పాపయ్యపల్లె మీదుగా సైదాపూర్ వరకు 15 కి.మీ.ల సింగిల్‌రోడ్డును డబుల్ లేన్‌గా విస్తరించాలన్నారు. కొడిమ్యాల నుండి గోవిందారం మీదుగా తాండ్రియాల వరకు 30 కి.మీ. మేరకు సింగిల్ లేన్ రోడ్డును డబుల్ లేన్‌గా విస్తరించాలన్నారు. చొప్పదండి మండలం ఆర్నకొండ నుంచి గోపాల్‌రావుపేట మీదుగా మల్యాల చౌరస్తా వరకు 45 కి.మీ.లు, ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ నుంచి సింగారం మీదుగా ముస్తాబాద్ మండలం రాంరెడ్డి పల్లె వరకు15 కి.మీ.ల రోడ్డును డబుల్ లేన్‌గా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ జిల్లాలోని గుండ్లపల్లి పోతూరు రోడ్డు (కి.మీ.18/0-2) బావుపేట, ఖాజీపూర్ (కి.మీ 2/0-2) వరకు మానేరు నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించి త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని బండి సంజయ్‌కుమర్ తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలో ఇప్పటికే సీఆర్ఐఎఫ్ నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై నితిన్‌గడ్కరీ ఆరా తీశారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర

- బోనాలు సమర్పించిన భక్తులు





బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు, మల్లికార్జునస్వామి ఉత్సవ మూర్తి

గొల్లపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపేట గ్రామంలో జరుగుతున్న మల్లికార్జున స్వామి జాతర కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా మూడో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి బెల్లం పానకంతో వండిన బోనాలను ఇష్టదైవానికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, ఒగ్గు పూజారుల ఢమరుకనాదాలు, భక్తుల మల్లన్న నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో భక్తులు మల్లన్న పట్నాలు వేసి ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సుమారు 30వేల మంది స్వామివారిని దర్శించుకోగా ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి 57,630 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య, ఆలయ ఈవో విక్రమ్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు నర్సయ్య, రాజన్న, కిషోర్, సత్తయ్య, నాయకులు మల్లయ్య, సుధాకర్, చందు భక్తులు పాల్గొన్నారు.

కూలీలకు అన్నప్రసాద వితరణ

కరీంనగర్ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని ఇటుక బట్టీల వద్ద వలస కూలీలకు బుధవారం లయన్స్‌క్లబ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేపట్టారు. లయన్ కోల లావణ్య- అన్నారెడ్డి పెళ్లి రోజు సందర్భంగా అన్న ప్రసాదన వితరణ చేపట్టగా కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కాంరెడ్డి నరసింహారెడ్డి, సెక్రెటరీ బట్టు రాజేందర్, లయన్ చింతల కిషన్ పాల్గొన్నారు.

రక్తదానం

గణేశ్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వివేకానంద డిగ్రీ,పి.జి. కళాశాల కామర్స్ అధ్యాపకుడు డాక్టర్ రాపోలు గోపికృష్ణ 37వసారి రక్తదానం చేశాడు. కామారెడ్డి జిల్లా మాచిరెడ్డి మండలం సోమర్‌పేట్ గ్రామానికి చెందిన సర్మన్ బదావత్ (65) గుండెకు ఆపరేషన్ నిమిత్తం స్థానిక అపోలో రీచ్ ఆసుపత్రిలో చేరాడు. అత్యవసరంగా రక్తం అవసరం కాగా రాపోలు గోపికృష్ణ వెంటనే స్పందించి రక్తదానం చేసి ఆదుకున్నాడు. గోపికృష్ణను వివేకానంద ప్రిన్సిపల్ శ్రీనివాస్ అభినందించారు.

'ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం'

సుభాష్‌నగర్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు తాము పూర్తి వ్యతిరేకమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ క్లబ్ అధ్యక్షుడు భైరం కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీం అక్తర్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి మాడేపు హరిబాబు, మాడేపు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయలకు అవగాహన సదస్సు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు బుధవారం ఎంఈవో రవీందర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంపెక్స్ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ అందజేత

సుభాష్‌నగర్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాంనగర్‌కు చెందిన రమ్య అనే పేద మహిళకు ఆర్యవైశ్య మహాసభ మహిళా అధ్యక్షురాలు చకిలం స్వప్న ఆధ్వర్యంలో రమ్యకు కుట్టు మిషన్ అందజేశారు. రాచకొండ క్రిషిక, మౌనిక, కార్తిక్ పుట్టిన రోజు సందర్భంగా వారి సహకారంతో కుట్టుమిషన్ అందజేశామని తెలిపారు.

విలీన డివిజన్ల అభివృద్ధికి నిధులివ్వాలి


పనులను ప్రారంభిస్తున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో ఐదేళ్ల క్రితం విలీనమైన డివిజన్లలో మౌళిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు ఇవ్వాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం మేయర్ సునీల్‌రావు 18, 57 డివిజన్లలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 57వ డివిజన్ పరిధిలోని విద్యానగర్‌లో 20లక్షల నిధులతో చేపట్టనున్న ఎస్‌డబ్ల్యూజీ పైపులైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి కార్పొరేటర్ బండ సుమ రమణారెడ్డితో కాలనీ సమస్యలపై చర్చించారు. 18వ డివిజన్ రేకుర్తిలోని శ్రీసమ్మక్క సారలమ్మ ఆలయ సమీపంలో, ధర్మపురి వీధిలో 12లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైపులైను పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం నగర పాలక సంస్థలో విలీనం చేసిన గ్రామాల్లో ఇప్పటికీ ఆశించిన అభివృద్ధి జరగలేదన్నారు. కొత్తగా నగరపాలక సంస్థలో మరిన్ని గ్రామాలను, కొత్తపల్లి మున్సిపాలిటీని విలీనం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ప్రతిపాదనపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన కోరారు. 28.5 కిలో మీటర్ల విస్తీర్ణంలో ఉన్న కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధి ఎనిమిది సమీప గ్రామాల విలీనంతో 65 కిలో మీటర్లకు చేరిందన్నారు. దీనితో ఆయా డివిజన్లలో అభివృద్ధి చేసేందుకు నగర పాలక సంస్థలో ఆర్థిక వనరులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ఇప్పటికే 100కోట్లతో విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినా ఇంకా చేయాల్సినవి ఎన్నో ఉన్నాయన్నారు. డివిజన్ల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు 50 కోట్లు ఇచ్చే విధంగా అధికార పార్టీ నేతలు కృషి చేయాలని సునీల్‌రావు కోరారు. కార్పొరేషన్‌లో గ్రామాలను విలీనం చేసి విస్తీర్ణం పెంచితే నిధుల లభ్యత లేక ప్రజలు ఇబ్బందులు పడతారని, వారిపై పన్నుల భారం కూడా ఉంటుందని మేయర్ అన్నారు. ఇప్పటికైనా గ్రామాల విలీన ప్రతిపాదనలను ఉపసంహరించుకొని విలీన డివిజన్లలో అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని మేయర్ సునీల్‌రావు కోరారు. ఈకార్యక్రమంలో ఈఈ సుబ్రహ్మణ్యం, డీఈ అయాజ్‌ఖాన్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో అసమ్మతి గళం

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమాలు చేపట్టకుండా దూరంగా ఉంటూ వస్తున్నారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇన్‌చార్జిగా ఉన్నా పెద్దగా కార్యక్రమాలకు వచ్చి సమీక్షలు నిర్వహించింది లేదు. ఒకేసారి మాత్రమే ఆయన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాత్రమే జిల్లా రాజకీయాల్లో చురుకుగా ఉంటున్నారు. ఆయన అనుచరునిగా ఉంటూ వస్తున్న పురుమల్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తూ సమావేశాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా మరో రెండు సమావేశాలు కూడా జరుగుతాయని ప్రకటించడంతో ఆయన అసంతృప్తి ప్రభుత్వంపైనా లేక మంత్రి పైనా అనే చర్చ జరుగుతున్నది. దీనిని మంత్రి పొన్నం ప్రభాకర్ ఎలా స్వీకరిస్తారు అనే విషయం కూడా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది.

టౌన్ ఏసీపీగా వెంకటస్వామి బాధ్యతల స్వీకరణ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ టౌన్ ఏసీపీగా వెంకటస్వామి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు టౌన్ ఏసీపీగా పనిచేసిన నరేందర్ డీజీపీ కార్యాలయానికి అటాచ్‌గా బదిలీ కాగా ఆయన స్థానంలో వెంకటస్వామికి పోస్టింగ్ ఇచ్చారు. విధుల్లో చేరిన అనంతరం టౌన్ ఏసీపీ వెంకటస్వామి సీపీ అభిషేక్ మొహంతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కవి రావుల పవన్‌కుమార్ మృతి



కరీంనగర్ కల్చరల్/రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చామనపెల్లి గ్రామానికి చెందిన యువ కవి, రచయిత, గాయకుడు రావుల పవన్‌కుమార్(35) అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున కరీంనగర్‌లోని ఓఆసుపత్రిలో మృతి చెందారు. కంజెర వాయిస్తూ, కవితలు చెప్పే పవన్ కుమార్ ఇటీవల నడిమెట్ల రాగాల పురస్కారాన్ని అందుకున్నారు. తెరవే జిల్లా సహాయ కార్యదర్శిగా కొన్నేళ్ళుగా క్రియాశీలక పాత్ర పోషించారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల ఎన్నీల ముచ్చట్ల కవుల బృందం, రామకృష్ణ సేవాసమితి బాధ్యులు, పలువురు కవులు, కళాకారులు, రచయితలు నివాళులర్పించారు. అవివాహితుడైన పవన్‌కుమార్ అంత్యక్రియలు చామనపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించారు.

'రైతులకు బేడీలు వేసిన ఘనత బీఆర్ఎస్‌దే'



మాట్లాడుతున్న కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా చైర్మన్ అంజనేయులుగౌడ్

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు బేడీలు వేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని కాంగ్రెస్‌పార్టీ బీసీ సెల్ జిల్లా చైర్మన్ పులి అంజనేయులుగౌడ్ ఎద్దేవా చేశారు. డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఖమ్మం జిల్లాలో ఎండుమిర్చి రైతు లకు బేడీలు వేసి దేశవ్యాప్తంగా విమర్శలు ఎదుర్కొందన్నారు. ఇప్పుడు ఆ పార్టీ నాయకులు బీఆర్ అంబేద్కర్‌కు వినతిపత్రం సమర్పించడం సిగ్గుచేటన్నారు. లగచర్లలో కలెక్టర్‌పై దాడి చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులను అరెస్టు చేస్తే రైతులను ఉసిగొల్పి సంకెళ్ల వేశారని నిందిస్తారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వరహాలచారి, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బోనాలతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

సుభాష్‌నగర్, డిసెంబరు(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు బుధవారం బోనాలు, పోతరాజు వేశాలతో వినూత్న నిరసన వ్యక్తం చేశారు. వారి దీక్ష శిబిరాన్ని ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ బండారి రాజ్‌కుమార్ సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గుండా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేశ్ పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆలయాల్లో బుధవారం సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భగత్‌నగర్ అంజనాద్రి లక్ష్మీగణపతి, జెడ్‌పి క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప, రాంపూర్ గిద్దెపెరుమాండ్లు, కమాన్‌రోడ్ రామేశ్వర, అశోక్‌నగర్ వాసవికన్యకాపరమేశ్వరి, ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయక స్వామి, పాతబజార్ గౌరీశంకర, చైతన్యపురి మహాశక్తి ఆలయాలతో పాటు పలు దేవాలయాల్లో జరిగిన అభిషేక, అలంకార, అర్చనల్లో, గణపతి హవనాల్లో భక్తులు పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో పొలాల మధ్యలో వెలిసిన విగ్నేశ్వరుడికి సంకష్ట చతుర్తి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడికి క్షీరాభిషేకం, అభిషేకాలు, ప్రత్యేక హారతులు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి దంపతులతో పాటు పలు గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో అదనపు కమిషనర్ సువార్త ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ కేక్‌ను మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కమిషనర్ సువార్తతో కలిసి కట్ చేశారు. ఈసందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ అన్ని పండుగలను సమానంగా గౌరవిస్తున్నామని చెప్పారు. అనంతరం కేక్, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, బోనాల శ్రీకాంత్, దిండిగాల మహేశ్, సుధగోని మాధవికృష్ణగౌడ్, నాయకులు గందె మహేశ్ పాల్గొన్నారు.

అధ్యాపకులకు సన్మానం

గణేశ్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగానికి చెందిన మహమ్మద్ తాహిర్ హుస్సేన్, గణితశాస్త్ర విభాగానికి చెందిన స్వరూపరాణి ఇటీవల పీహెచ్‌డీ పూర్తిచేయగా బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజయ్య పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్‌కు అవార్డులు

సుభాష్‌నగర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ జంధ్యం మాధవి పలు అవార్డులు అందు కున్నారు. మధురైలో నిర్వహించిన వాసవి ఇంటర్నేషనల్ అంతర్జాతీయ సదస్సులో ఆమె మూడు అవార్డులను అందుకున్నారు. ఐదు ఫారెన్ క్లబ్స్‌ను ప్రారంభించినందుకుగాను సూపర్ బెస్ట్ గవర్నర్ అవార్డు, బ్యానర్ ప్రెజంటేషన్‌కు ప్రత్యేక అవార్డు అందుకున్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో కోరా జాన్సన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కోరా జాన్సన్ పాఠశాల డైరెక్టర్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ హ్యాండ్‌బాల్ పోటీల్లో నగరంలోని కోరా పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి బాలికల విభాగంలో జిల్లాస్థాయిలో మొదటి బహుమతిని గెల్చుకున్నారు. పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డిలు ప్రతిభ చూపిన బాలికలను అభినందించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్

సుభాష్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆసుపత్రిలో నగరానికి చెందిన ఓ మహిళ(48)కు బుధవారం ల్యాప్రోస్కోపిక్ ఆపరే షన్‌ను విజయవంతంగా నిర్వహించామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. నగరానికి చెందిన ఓ మహిళ కడుపునొప్పితో బాధపడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరింది. ఆమెకు పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు కడుపులో నీటి బుడగ ఉన్నట్లు గుర్తించి ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఆర్ఎంవో డాక్టర్ నవీన, డాక్టర్ దీప్తి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మహేందర్, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ డాక్టర్ శాంతన్ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి'

సుభాష్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప అన్నారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీం అక్తర్‌కు వినతిపత్రం అందచేసినట్లు తెలిపారు. రిజర్వేషన్ ఫలాలను అందరికీ అందేలా చూడాలన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్‌కు వినతుల వెల్లువ


కమిషన్ చైర్మన్ షమీంఅక్తర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

సుభాష్‌నగర్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై బుధవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీంఅక్తర్‌కు దళిత సంఘాల నాయకులు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇంజం వెంకటస్వామి, రుద్రారపు రామచందర్, మారంపెల్లి శ్రీనివాస్, దండు అంజయ్య తదితరులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు మైసని మనోహర్ వినతిపత్రం అందజేశారు. జనాభా నిష్పత్తి ప్రకారం వర్గీకరణ జరగాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మంద శ్రీనివాస్ కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు.

●రామడుగు: వర్గీకరణ చేపట్టాలని ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు చొప్పదండి ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శంకర్ వినతిపత్రం సమర్పించారు.

●జమ్మికుంట: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు మాదిగ లాయర్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు మట్టిల తిరుపతి, మారెపల్లి ప్రభాకర్, కళ్యాణ్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ


కేశవపట్నంలో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయ పునర్నిర్మాణం కోసం దాతల సహాయంతో పాటు ప్రభుత్వం సీజీఎఫ్ నిధుల కింద రూ. 50లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరగా ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం అయ్యప్పస్వామి దీక్ష పరులకు పండ్లు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, ఆలయ కమిటీ చైర్మన్ గాజుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, డైరెక్టర్ తనుకు ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ గుర్రం రామస్వామి, మాజీ సర్పంచ్‌లు గొడిశాల రాజకొంరయ్య, మొత్కూర్ సమ్మయ్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

వీణవంక, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల మండల కార్యవర్గం ఎన్నిక బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో జరిగింది. అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా రాజేందర్, గౌరవ అధ్యక్షులుగా మధుసూదన్, ఉపాధ్యక్షులుగా యశోద, శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా రవి, ఐలోని, కోశాధికారిగా క్రిష్ణ, ఈసీ మెంబర్స్‌గా సందీప్, సుష్మ, రజిత, రాజు, శరత్ ఎన్నికయ్యారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం



మహేందర్‌రెడ్డి, అశోక్

వీణవంక, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ మండల శాఖ కార్యవర్గాన్ని బుధవారం నాయకులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చాడ మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుకోసి అశోక్ ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను సంఘం గౌరవ అధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరహరి రాంరెడ్డి, జయేంద రెడ్డి, అట్ల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కలిగేటి లక్ష్మీ నర్సయ్య, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీచైతన్యలో వర్క్‌షాప్ ప్రారంభం

తిమ్మాపూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌ను విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. హ్యాండ్ ఆఫ్ ట్రేడింగ్ ఆన్ టైఫూన్ హిల్ అనే అంశంపై ఈ నెల 24వ తేదీ వరకు వర్క్‌షాప్ జరగనుంది. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమం తప్పకుండా కళాశాలకు రావాలని సూచించారు. దీంతో ఉత్తీర్ణత మాత్రమే కాకుండా ప్రాంగణ నియామకాలు పొందగలుగుతారని సూచించారు. కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్స్‌గా ఎస్ఆర్ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్లు చందన్ కుమార్, వేదిక్, సచ్చిదానంద సేఫ్ డిజైన్, టెస్టింగ్, వెలిడేషన్ ఆఫ్ పవర్‌కు సంబంధించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విభాగాధిపతి ఓదెలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో 33/11 సబ్ స్టేషన్ నిర్మాణం

- తీరనున్న కరెంటు కష్టాలు


నిర్మాణంలో ఉన్న 33/11 సబ్‌స్టేషన్

హుజూరాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 33/11 సబ్‌స్టేషన్ నిర్మాణంతో పట్టణ ప్రజలకు లో వోల్టేజీ సమస్య తీరనుంది. సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంతో సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. 30ఏళ్ల క్రితం హుజూరాబాద్ పట్టణ శివారులోని బోర్నపల్లిలో సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. ఈ సబ్‌స్టేషన్‌కు పట్టణంతో పాటు వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరా అయ్యేది. ఇటీవల పట్టణ ప్రాంతం పెరగడంతో పాటు 12వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటికి తోడు ఇండస్ట్రియల్ ఉన్నాయి. తరుచూ లో వోల్టేజీ సమస్యతో పట్టణ ప్రజలకు కరెంటు సమస్య నెలకొనేది. దీనిని దృష్టిలో పెట్టుకొని నూతనంగా సబ్‌స్టేషన్ మంజూరు చేశారు. హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శంకుస్థాపన చేసి పనులు చేపడు తున్నారు. ఇది కేవలం హుజూరాబాద్ పట్టణానికి మాత్రమే విద్యుత్ సరఫరా చేయనుంది. బోర్నపల్లి శివారు నుంచి ఇటీవనే నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. రెండు నెలల్లో ఈ సబ్‌స్టేషన్ పూర్తి కానుందని ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణం సదరు కాంట్రాక్టర్ శరవేగంతో పనులు చేపడు తున్నాడు. సబ్‌స్టేషన్ నిర్మాణం జరిగితే హుజూరాబాద్‌లో నిరంతరంగా విద్యుత్ సరఫరా కానుంది. సబ్‌స్టేషన్ నిర్మాణం జరుగుతుండడంతో పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఐ తాండ్ర నరేష్

గన్నేరువరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతుండడంతో యువత, విద్యార్థులు, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తాండ్ర నరేష్ అన్నారు. బుధవారం మండలంలోని గుండ్లపల్లి శ్రీరామకృష్ణ ప్రైవేట్ పాఠశాలలో సైబర్ మోసాలపై, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్‌ల ద్వారా వివిధ యాప్‌ల పేరు తో, ఏపీకే లింక్‌లను పంపిస్తూ సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి డబ్బులు పంపమని అడిగినా, బ్యాంక్ పిన్ నంబర్లు, ఓటీపీ నంబర్లు అడిగినా ఇవ్వవద్దని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దన్నారు. ప్రతిఒక్కరూ సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ గురుకులంలో తీరిన నీటి కష్టాలు

గంగాధర, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ గురుకుల బాలిక విద్యాలయంలో బోరు వేయడంతో ఇబ్బందులు తొలగినట్లు మార్కెట్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో బోరు పాయింట్ వద్ద బోరును వేయించారు. వారం క్రితం గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సందర్శించారు. ఈ సందర్భంగా కొన్ని సంవత్సరాలుగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి నాయకులు తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సొంత నిధులు వెచ్చిస్తానని స్థానిక కాంగ్రెస్ నాయకుడు జాగిరపు శ్రీనివాస్‌రెడ్డికి తెలిపి, తక్షణం బోరు వేయించాలని సూచించారు. బుధవారం పాఠశాలలో బోరు పాయింట్ వద్ద ఉపాధ్యాయులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లతో పూజలు నిర్వహించి బోరు వేయిం చారు. మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యేకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

యువత మత్తుపదార్థాలకు బానిస కావద్దు

- ఎక్సైజ్ ఎస్ఐ విజయభాస్కర్

చొప్పదండి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు బానిస కావద్దని కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ ఎస్ఐ విజయభాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని గుమ్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తుపదార్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడుకోవాలని అన్నారు. కలెక్టర్ సూచన మేరకు పాఠశాలలో కాన్షియస్నెస్ క్లబ్‌ను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎక్సైజ్ సిబ్బంది శ్రీలత, రమాదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోతులతో రైతుల బెంబేలు


ఉల్లంపల్లిలో వడ్ల కల్లం వద్ద కోతుల మంద

చిగురుమామిడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోతుల దాడులతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కోతుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. గ్రానైట్ వ్యాపారులు గుట్టలను ధ్వంసం చేయడంతో కోతులు గ్రామాల్లోకి వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. వందల సంఖ్యలో కోతులు పంటలపై దాడులు చేస్తుండటంతో రైతులు ఏమీ చేయలేక పోతున్నారు. ఇళ్లలోకి కూడా వస్తుండటంతో మహిళలు, పిల్లలు భయపడుతున్నారు. ఏ పంట వేసినా నష్టం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏ పంట దక్కడం లేదు



కత్తుల రమేష్‌యాదవ్, రైతు బొమ్మనపల్లి

ఎలాంటి పంట వేసినా కోతులు తింటున్నాయి, లేదంటే నష్టం చేస్తున్నాయి. బావుల వద్దకు ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి ఉంది. దాడులు చేసి గాయపరుస్తున్నాయి. అటవీశాఖ అధికారులు స్పందించి కోతులు పంటలపై దాడులు చేయకుండా చూడాలి.

కోతుల దాడులు పెరుగుతున్నాయి



తాళ్లపెల్లి తిరుపతిగౌడ్, రైతు, సుందరగిరి

రోజురోజుకు కోతుల దాడులు పెరుగుతున్నాయి. కోతుల బెడదతో రైతులు పంటలు వేయడానికి భయపడుతున్నారు. ఊళ్లలోకి వచ్చి మహిళలు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి.

వృద్ధుడిని ఆశ్రమానికి తరలింపు

రామడుగు/భగత్‌నగర్ డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్టాండ్‌లో వారం రోజులుగా ఉంటున్న అనాథ వృద్ధుడి పరిస్థితిని చూసిన బస్టాండ్ పోలీసులు రామడుగు మండలం వెలిచాల గ్రామంలో స్పందన అనాథ ఆశ్రమ నిర్వాహకుడు మంచికట్ల శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆశ్రమ నిర్వాహకుడు బస్టాండ్‌కు చేరుకొని వృద్ధుడిని తన వెంట తీసుకెళ్లారు. కా ర్యక్రమంలో బస్‌స్టేషన్ ఏటీఎం సురేషన్, ఎస్ఎన్ అంజయ్య, బస్‌స్టేషన్ సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు.

● సంక్షిప్తం..

●చొప్పదండి: రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్‌లో ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికైన విద్యార్థి రామడుగు సిద్ధార్థను ఆయన తల్లిదండ్రులను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ జి కాళహస్తి, పేరెంట్ కమిటీ చైర్మన్ భూత్కూరి శంకర్ పాల్గొన్నారు.

●హుజూరాబాద్: హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు నిర్వాహ కుడు గంగిశెట్టి జగదీశ్వర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర, బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లను అందజేశారు.

●పట్టణంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక-శ్రీనివాస్ నివాసంలో బుధవారం పడి పూజ వైభవంగా జరిగింది.

●జమ్మికుంట: జమ్మికుంట ప్రభుత్వ ఆసుత్రిలోని పాత వస్తువుల అమ్మకానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 19న సమర్పించిన కొటేషన్లను 20న తెరువనున్నట్లు ఆయన తెలిపారు.

●జమ్మికుంట: మండలంలోని మాచనపల్లికి చెందిన పర్లపల్లి నాగరాజు ఇటీవల యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కాగా, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించారు.

● గంగాధర: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కురిక్యాల మాజీ ఎంపీటీసీ అలువోజి నందయ్య కుటుంబాన్ని గంగాధర సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు, మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్ రెడ్డి పరామర్శించారు.

● వీణవంక: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కరాటే శిక్షణ ప్రారంభమైనట్లు హెచ్ఎం పులి అశోక్‌రెడ్డి తెలిపారు.